పెద్ద దర్గాలో రాకాస బృందం

బిల్టప్ (కడప), న్యూస్‌టుడే: ఇటీవల విడుదలై ప్రదర్శితమవుతున్న రాకాస చిత్ర బృందం కడప నగరంలోని పెద్ద దర్గాలో సోమవారం సందడి చేసింది. సినీ కథానాయకుడు సంగీత్ శోభన్, కథానాయికలు కొణిదెల నిహారిక, నయన్ సారిక తదితరులకు దర్గా నిర్వాహకులు తొలుత స్వాగతం పలికారు. దర్గా విశిష్టతను వివరించారు. నటీనటుల బృందం పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించింది. కార్యక్రమంలో గెటప్ శ్రీను తదితరులున్నారు.

కేసీ కాలువలో ప్లాస్టిక్ భూతం!

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా వాసుల తాగు, సాగు నీటి అవసరాలు తీర్చడంలో కేసీ కాలువ ఎంతో కీలకం. ఇటువంటి కాలువను ప్లాస్టిక్ భూతం పట్టి పీడిస్తోంది. కొందరు చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను నీటిలో వేస్తున్నారు. దీంతో అవి గుట్టలుగా పేరుకుపోయి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. కడప నగరం సమీపంలోని రామరాజుపల్లె నుంచి పాత కడప చెరువుకు నీటిని సరఫరా చేసే కేసీ కాలువ నిండా పలు చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

చల్ల చల్లగా.. పానీయంతో జాగ్రత్త

కడప నగరపాలక, న్యూస్‌టుడే: సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. పగటి పూట వీచే గాలి వేడెక్కింది. నిలుచున్న నేల అగ్నిగుండంలా మారింది. ఈ నేపథ్యంలో చల్లచల్లగా బాదంపాలు, ఫలూదా, ఫ్రూట్ సలాడ్, కుల్ఫీ ఐస్, నన్నారి షరబత్, తెల్లటి మజ్జిగ, పండ్లరసాలు తీసుకుంటే బావుంటుందనుకునే వారు బోలెడు. అయితే బయటి దుకాణాల్లో తాగే ముందు కాస్త జాగ్రత్త తప్పదు. ఇటీవల శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురంలో బాదం పాలు తాగి పదుల సంఖ్యలో ఆసుపత్రి పాలయ్యారు. కడప నగరంలోని కొన్ని దుకాణాల నుంచి సేకరించిన బాదంపాల నమూనాల్లోనూ కల్తీ అయినట్టు అధికారులు పరీక్షల్లో గుర్తించారు. దీంతో కడపతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న పలు దుకాణాల్లో విక్రయించే శీతలపానీయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కడప నగరం గోకుల్ లాడ్జి కూడలిలో బాదంపాలు సంచార వాహనం

రంగు.. రుచికి రసాయనాలు

కడపలో దాదాపు 30 ప్రాంతాల్లో ఫలూదా విక్రయశాలలున్నాయి. జిల్లా వ్యాప్తంగా వీటి సంఖ్య 150 వరకు ఉంటుంది. వీటిలో ప్రధానంగా బాదంపాలను విక్రయిస్తున్నారు. చిక్కదనం, రంగు, వాసన కోసం వివిధ రకాల పౌడర్లను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వీటితోపాటు కుల్ఫీ, పండ్ల గుజ్జుతో చేసే జ్యూస్‌లను అపరిశుభ్ర వాతావరణంలో నాణ్యత లేని పదార్థాలతో తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మరికొన్ని శీతలపానీయాల దుకాణాల్లో తయారు చేసే మజ్జిగ, లస్సీ, నన్నారి షరబత్‌లలోనూ నాణ్యత లేని పదార్థాలను వినియోగిస్తున్నారు.

కానరాని తయారీ వివరాలు

కొన్ని ఫలూదా సెంటర్లు, శీతలపానీయాల దుకాణాలవారు విక్రయిస్తున్న పానీయాల తయారీకి వాడే వస్తువుల వివరాలు, తయారీ తేదీ ఉంచడం లేదు. పానీయాల నాణ్యతపై వినియోగదారుల దృష్టి పడకుండా అధిక మోతాదులో చక్కెర, చల్లటి ఐస్ కలపడం పరిపాటిగా మారింది.

ముమ్మరంగా చేస్తాం తనిఖీలు

నాణ్యత లేని కల్తీ శీతల పానీయాలపై ఫుడ్ సేఫ్టీ అధికారిణి హరిత మాట్లాడుతూ.. విక్రయ కేంద్రాల వారితో సమావేశం నిర్వహించి హెచ్చరిస్తామన్నారు. ఇప్పటికే చేపట్టిన తనిఖీల్లో కడపలోని ఒక బాదంపాలు విక్రయదారునికి రూ. 5 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలిపారు.

పదో తరగతి మూల్యాంకనం మొదలు

కడప విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ప్రశ్నపత్రాల మూల్యాంకనం కడప నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి మొదలైంది. విధులు కేటాయించిన ఉపాధ్యాయులు కేంద్రానికి చేరుకున్నారు. మొదటిరోజు ఒక్కొక్కరికి ఇరవై జవాబుపత్రాలు కేటాయించారు. మొత్తంగా 7,240 జవాబుపత్రాలు దిద్దారు. ట్యాబ్‌లలో మార్కుల నమోదుకు తొలుత సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనట్లు సమాచారం.

ప్రొద్దుటూరుకు మరో రెండు కోర్టులు

ఈనాడు, కడప: ప్రొద్దుటూరుకు మరో రెండు కోర్టులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1వ అదనపు సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), 8వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, మూడో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కోర్టులను నెలకొల్పుతున్నట్లు అందులో పేర్కొంది. రాష్ట్రంలో 96 అదనపు కోర్టుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వగా అందులో ప్రొద్దుటూరుకూ చోటు లభించింది. కొత్తగా ఏర్పాటయ్యే కోర్టులో సిబ్బంది నియామకానికి ఉత్తర్వులిచ్చింది. ప్రతి కోర్టుకు గ్రంథాలయం, ఫర్నీచర్ నిమిత్తం రూ. 10 లక్షలు చొప్పున నిధులు కేటాయించింది.

రైతేరాజు 6 లో

బ్రహ్మాండం.. రాములోరి బ్రహ్మోత్సవం

11 రోజుల్లో 3,23,716 మంది సందర్శన

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో గత నెల 26 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా సాగాయి. కూటమి ప్రభుత్వం ఆదేశాలతో తితిదే ఆధ్వర్యంలో అద్భుతమైన ఏర్పాట్లు చేసింది. జిల్లా యంత్రాంగం కూడా భాగస్వామ్యమై విజయవంతం చేసింది. ధ్వజారోహణం నుంచి పుష్పయాగం వరకు వేలాది మంది తరలివచ్చి ఆరాధ్యదైవం రామయ్యను దర్శించుకున్నారు. వేడుకలను కనులారా వీక్షించారు. నవమి శోభతో ఒంటిమిట్టకూ ప్రత్యేక గుర్తింపు లభించింది.

వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు

రాములోరి దర్శన భాగ్యం కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. పగటి, రాత్రి వేళల్లో నిర్వహించిన వాహన సేవలను వీక్షించి ఆధ్యాత్మిక దివ్యానుభూతి పొందారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, చెక్క, తాళ భజనలు బ్రహ్మోత్సవాలకు మరింత వన్నె తెచ్చాయి. సాహితీవేత్తలు ధార్మిక ఉపన్యాసాలు చేశారు.

రామాలయాన్ని దర్శించిన భక్తుల సమాచారం...

తేదీ	భక్తుల సంఖ్య
మార్చి 26	2,361
27	56,583
28	17,319
29	20,486
30	23,213
31	22,773
ఏప్రిల్ 1	60,098
02	40,897
03	28,280
04	24,248
05	27,458

మదిని దోచిన కార్యక్రమాలు

ఉత్సవాల వేళ ప్రదర్శించిన సంక్షిప్త రామాయణం కళాకృతులు భక్తుల మదిని దోచేశాయి. ఊంజల్ సేవ, గాయకుల భక్తిపాటలు అలరించాయి. విద్యుత్తు దీపాల వెలుగులు భక్తజనం మదిని దోచాయి. నిత్యాన్నదానం కేంద్రం వేలాది మందికి మూడు పూటలా ఆకలి తీర్చింది. ఆర్టీసీ బస్సుల్లో అతివలకు ఉచిత రవాణా వసతి కల్పించడంతో అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. రామయ్య క్షేత్రంలో పదకొండు రోజుల పాటు సాగిన ఉత్సవాల్లో మొత్తం 3,23,716 మంది దర్శించుకున్నట్లు తితిదే విజిలెన్స్, భద్రతాధికారులు లెక్కించారు.

కంచెలు.. ఆపై రంకెలు

◆ ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు
◆ ఘర్షణలకు దారితీస్తున్న అక్రమణలు

సిద్ధవటం, న్యూస్‌టుడే: సిద్ధవటం మండలంలో కడప- చెన్నై జాతీయ రహదారి, సిద్ధవటం-బద్వేలు ప్రధాన మార్గాల సమీపంలో భూముల విలువ పెరిగింది. దీంతో అక్రమార్కుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి. ఇష్టారీతిన ఆక్రమిస్తున్నారు. రాత్రికి రాత్రే యంత్రాలతో చదును చేసి ఆపై కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు పంటల సాగు చేస్తుండగా.. మరికొందరు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల ఆ స్థలాలు తమకు చెందినవంటే తమవంటూ వివాదాలకూ దిగుతున్నారు. ఈ పరిస్థితి శాంతిభద్రతలకు గొడ్డలి పెట్టుగా పరిణమిస్తోంది.

కమ్మపాలెంలో ఇటీవల కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

అధికారులతోనూ వాగ్వాదం

సిద్ధవటం మండలం కమ్మపాలెంలోని ప్రధాన రహదారి పక్కన సర్వే సంఖ్య 218, 219, 220, మరికొన్ని నంబర్లలో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేది. గతంలో కొందరు 25 ఎకరాలకు పైగా ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన మరికొందరు మిగిలిన మరో 25 ఎకరాలను కబ్జా చేసి చదును చేశారు. కొందరు ఏకంగా కంచె నిర్మించుకుని మొక్కలు కూడా నాటారు. పరిశీలనకు వెళ్లిన రెవెన్యూ అధికారులతోనూ వాగ్వాదానికి దిగారు.

ఏకంగా భవన నిర్మాణం

ఉప్పరపల్లెలోని కడప- చెన్నై జాతీయ రహదారి పక్కన సర్వే సంఖ్య 936/ఏలో 20 సెంట్ల విలువైన స్థలం ఖాళీగా ఉండేది. దీనిపై కన్నేసిన ఒంటిమిట్టకు చెందిన కొందరు ఆక్రమించారు. యంత్రంతో పునాదులు తీసి ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఓ సామాజిక వర్గానికి చెందిన నిర్వాసితులు సదరు స్థలాలను గతంలో తమకు అధికారులు కేటాయించారంటూ అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.

అయినా అదే మౌనం

ఉప్పరపల్లెలోని సర్వే సంఖ్య 936లో రైలు పట్టాల అవతల ఉన్న సుమారు అయిదు ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక నాయకుడు ఒకరు ఆక్రమించారు. కంచె వేసి పంట సాగు చేపట్టారు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో రెవెన్యూ అధికారులు వెళ్లి పరిశీలించారు. అయినా భూమి పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవలేదు.

ఉత్తర్వులతో వివాదం

మాధవరం-1 గ్రామంలోని సర్వే సంఖ్య 937లో 154 ఎకరాల ప్రభుత్వ భూమిని 2013లో మాధవరం-1లోని ఎస్‌కేఆర్ నగర్ దళితులకు(నిర్వాసితులు) ఇచ్చేందుకు కేటాయించారు. ఈ భూమిలో తమకు 40 ఎకరాల వరకు డీకేటీ పత్రాలు ఉన్నాయంటూ స్థానికులు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నారు. దీంతో దళితులు కూడా వారి వద్ద ఉన్న ఎండార్స్‌మెంట్ పత్రాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ఈ ఉదంతంతో ఇక్కడి ప్రభుత్వ భూములూ వివాదాస్పదంగా మారాయి.

చిచ్చు రేపిన విగ్రహం

మాధవరం-1 గ్రామ సచివాలయం పక్కన 40 సెంట్ల ప్రభుత్వ స్థలంలో వెంకటేశ్వరపురానికి చెందిన కొందరు విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మించారు. కాలనీ వాసులు తమకు కూడా అందులో స్థలాలు ఉన్నాయనడంతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది.

ఆక్రమణలను అడ్డుకుంటాం: కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పరిశీలించాం. కొన్ని చోట్ల ఆక్రమణలను అడ్డుకున్నాం. మరికొన్నిచోట్ల సర్వే చేసి నివేదికలు తెప్పించుకున్నాం. త్వరలోనే అడ్డుకట్టకు చర్యలు చేపడతాం.

- తిరుమలబాబు, తహసీల్దార్, సిద్ధవటం

జడ్పీలో దొంగ ఉద్యోగులపై విచారణ

ఈనాడు, కడప: కడప జిల్లా పరిషత్‌లో ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండానే ఇష్టారాజ్యంగా ఉద్యోగుల నియామకాలు చేపట్టడంపై అధికారులు స్పందించారు. ఈ ఉదంతంపై పూర్తిస్థాయి విచారణకు జేసీ నిధి మీనాను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. ఉద్యోగుల మరణాలు లేకున్నా కారుణ్య నియామకాల పేరిట వైకాపా హయాంలో ఈ నియామకాలు సాగాయి. ఇటీవల రికార్డుల పరిశీలనలో ఈ వ్యవహారం వెలుగుచూసింది. మొదట్లో పది మంది వరకు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత క్రమంగా వీరి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఉదంతంలో జడ్పీలోని ఇద్దరు అధికారుల పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అక్రమ నియామకాలు, నాలుగేళ్లుగా జీతాలు పొందడంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ ద్వారా పాత్రధారులు... సూత్రధారులను తేల్చాలని జేసీని ఆదేశించారు.

చిన్ననాటి కల.. ఐఆర్ఎస్‌నయ్యా

◆ పట్టుదల.. సంకల్పమే ఆయుధాలు



పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: చదువుకునేందుకు ఊళ్లో ఇంటర్నెట్ సౌకర్యం కూడా లేదు. అవసరమైన పుస్తకాలూ అందుబాటులో ఉండవు. అయినా ఆమె దేశంలోనే అత్యంత కఠిన పరీక్షగా పేరొందిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమైంది. కొద్ది తేడాతో అవకాశం కోల్పోయింది. అయినా నిరాశ చెందలేదు. అనారోగ్యంతో మంచానపడిన తల్లి.. ఆర్థిక స్థోమతలేని కుటుంబం వంటి ఆటుపోట్లను అధిగమించింది. ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఫలితాల్లో మెరిసింది. తన చిన్ననాటి కలను సాధించి శెభాష్ అనిపించుకుంటోంది. సాధించాలనే పట్టుదల, సంకల్పం, కుటుంబ ప్రోత్సాహమే తన విజయానికి ఆయుధాలని చాటి చెప్పింది. ఆ యువతే పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల పూర్వ విద్యార్థిని **రాయలం జయశ్రీ**. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

ఇదీ నేపథ్యం

మాది చిత్తూరు జిల్లా పలమనేరు మండలం జలవారిపల్లె. శ్రీరాములరెడ్డి, మునెమ్మ దంపతులకు రెండో సంతానం. పశువుల దాణా దుకాణమే కుటుంబ జీవనాధారం. పలమనేరులో ఇంటర్మీడియట్ అభ్యసించాను. పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో చేరి 2023లో సీఎస్ఈ కోర్సు పూర్తి చేశాను.

తొమ్మిదో తరగతిలోనే లక్ష్యం

చిన్నప్పటి నుంచి పత్రికలు, పుస్తకాలు చదవడం అలవాటు. స్ఫూర్తిదాయక కథనాలు, ప్రముఖుల విజయగాథలు ప్రేరణ ఇచ్చేవి. మంచి అధికారిణిగా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యాన్ని 9వ తరగతి చదివే రోజుల్లోనే నిర్ణయించుకున్నా. ఇంజినీరింగ్ కోర్సు అభ్యసిస్తున్నప్పుడు యూపీఎస్సీ పోటీ పరీక్షలు రాయాలనే ఆలోచన వచ్చింది. నాన్నతో పంచుకుంటే అంత ఆర్థిక స్థోమత మనకు లేదని, ముందు సాధారణ ఉద్యోగం తెచ్చుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. చదువు పూర్తయ్యాక మరోసారి కుటుంబ సభ్యులతో చర్చించా. అంగీకరించడంతో పరీక్షకు సన్నద్ధమయ్యా. 2023లో అయిదు మార్కుల తేడాతో సర్వీస్ కోల్పోయా.

దరి చేరలేదు నిరుత్సాహం

నెట్ సౌకర్యం, కావాల్సిన పుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో మా గ్రామం నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చి పరీక్షలకు సన్నద్ధమయ్యా. 2024, 2025లో అపజయం పలకరించినా నిరుత్సాహ పడలేదు. ఎలాగైనా నెగ్గాలనే కసితో చదివా. లోపాలను సరిదిద్దుకున్నా. 2026 ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో 360 ర్యాంకు సాధించాను. వాస్తవానికి ఈ పరీక్ష నోటిఫికేషన్ వచ్చిన సమయంలో అమ్మకు ఆరోగ్యం బాగాలేక శస్త్రచికిత్స చేయించాం. ఆమెను చూసుకునేందుకు పరీక్ష రాయలేననుకున్నా. అన్న, నాన్న ధైర్యం చెప్పారు. ఆ బాధ్యతలు తీసుకుని తనను పరీక్షకు సన్నద్ధమవ్వమని ప్రోత్సహించారు. వారి సహకారంతో సివిల్స్ విజేతగా నిలిచా.

తాగేవన్నీ కాదు మంచినీళ్లు

పరీక్షతో తెలుసుకోవచ్చు నాణ్యత

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మనిషి బతకాలంటే నీళ్లు కావాలి. అవి తాగేందుకు పనికొచ్చేవై ఉండాలి. చాలా మంది తాగే నీటి గురించి శ్రద్ధ చూపరు. అందుబాటులో ఉన్నవి తాగి అనారోగ్యం బారిన పడుతుంటారు. గతంలో జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు కలుషిత నీరు తాగి పలువురు ఆసుపత్రి పాలయ్యారు. నీటి విక్రయ కేంద్రాల్లో ఇష్టారీతిన నీటిని విక్రయిస్తున్నారు. శుద్ధి యంత్రాలు, కంటికి కనిపించేలా భారీ స్టీలు డ్రమ్ములు అమర్చి ఫిల్టర్ వాటర్‌ను ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. తాగునీరు నిర్ణీత ప్రమాణాల ప్రకారం ఉందా అనే విషయం చాలా ముఖ్యమని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. గుర్తించడానికి టోటల్ డిసాల్వ్‌డ్ సాలిడ్స్(టీడీఎస్) స్థాయి పరీక్ష చేయాలని సూచిస్తున్నారు.

మైలవరం మండలం డి.నండ్యాల పంప్‌హౌస్ వద్ద నీటి నమూనాలు పరీక్షిస్తున్న జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డీఈ సురేంద్రబాబు

టీడీఎస్ ఎక్కువైనా, తక్కువగా ఉన్నా ఇబ్బందేనని, అనారోగ్యానికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. అన్ని పురపాలక సంఘాలు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల్లో ఇందుకు సంబంధించిన మీటర్లు ఉన్నాయి. నీటి నమూనాలను 30 సెకన్లలో పరీక్షించి టీడీఎస్ విలువ లెక్కించొచ్చు.

పీపీఎం	సూచన
0 – 50	నీటిలో లవణాల స్థాయి తక్కువ
50 –250	నీళ్లను తాగొచ్చు
250 – 500	రుచి ఉండకపోయినా తాగొచ్చు
500 – 1,200	పద్ధతి చేశాక తాగాలి
1,200 అపైన	తాగకూడదు

(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ప్రమాణాల ప్రకారం టీడీఎస్ విలువలు)

15 నుంచి పుష్పగిరి క్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: ఈ నెల 15 నుంచి నిర్వహించే వల్లూరు మండలంలోని కామాక్షి వైద్యనాథేశ్వర శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి కోరారు. ఆలయ నిర్వాహకులు, అధికారులతో కలిసి పుష్పగిరి క్షేత్రం బ్రహ్మోత్సవాల ప్రచార గోడపత్రాలను ఆయన సోమవారం కడపలో ఆవిష్కరించారు. పుష్పగిరి క్షేత్రంలో 19న చందనోత్సవం, 22న రథోత్సవం ఉంటాయని తెలిపారు.

వంటకు తప్పదు పాత తంటా

పశ్చిమాసియా యుద్ధంతో వంటకు ఎల్‌పీజీ కొరతతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కొందరు వంట కోసం పాతకాలం పద్ధతుల వైపు మళ్లుతున్నారు. గ్యాస్ పొయ్యి స్థానంలో ప్రత్యామ్నాయాలు ఏర్పాటుకు ఎక్కువ మంది వంట చెరకు(కట్టెల పొయ్యి) వినియోగిస్తున్నారు. వీటితో పాటు గతంలో వినియోగించిన పొట్టు పొయ్యిలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రొద్దుటూరులో వీటిని అమ్మకానికి ఉంచారు. నేటి తరం యువతకు వీటిపై అవగాహన తక్కువగా ఉండటంతో వింతగా చూస్తున్నారు. తెలిసిన వారు గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు. అవసరమైన వారు కొని వినియోగిస్తున్నారు.

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం

లబ్ధిదారు వాకిట బంగారు కోడిపెట్ట!

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశం మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులకు నాటు కోళ్లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు ముప్పై వేల స్వయం సహాయక సంఘాలున్నాయి. ఒక్కొక్క సంఘంలో పది మంది చొప్పున 3 లక్షల మంది సభ్యులున్నారు. సంఘంలో ఆసక్తి ఉండి కొనుగోలుకు ముందుకొచ్చే ప్రతి మహిళకూ కోళ్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వం పంపిణీ చేసిన నాటుకోళ్లతో లబ్ధిదారులు.. చిత్రంలో అధికారులు

జిల్లాలో తొలి విడతగా 18 వేల నాటు కోళ్లు పంపిణీ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏపీ హేచరీ, పశుసంరక్షక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఒక యూనిట్‌కు పది కోళ్లు(8 పెట్టలు, రెండు పుంజులు.. లేదంటే ఏడు పెట్టలు, మూడు పుంజులు) పంపిణీ చేశారు. ఇలా సుమారు 1,800 యూనిట్లకు గాను 18 వందల మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు వీటిని అందించారు. సభ్యులు యూనిట్‌కు రూ. 3,700 ప్రకారం సొంతంగా చెల్లించారు.

18 వేల కోళ్లు

భలే ఆదాయ వనరు

ప్రస్తుతం నాటుకోడి మాంసం ధర కిలో రూ. 700 పైచిలుకే పలుకుతోంది. కోడి గుడ్లు బాయిలర్ ఒకటి రూ. 7 ధర ఉంటే.. నాటుకోడివి ఒకటి రూ. 15 వెచ్చించి వినియోగదారులు తీసుకుంటున్నారు. లబ్ధిదారుకు ఇవి ఓ ఆదాయ వనరుగా మారనున్నాయి. తొలి విడత పంపిణీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయినందున.. రెండో విడత జూన్ లేదా జులై నెలలో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తాగేది గంజాయి.. వీధికో జులాయి

● కడప వనంలో 'మత్తు' భూతాలు
● ఉక్కుపాదం మోపకనే నేరాలు

● **2023 సెప్టెంబరు 24న** కడప రవీంద్రనగర్‌లో ఆటో డ్రైవర్ సద్దాం ఖాన్(23)ను కొందరు గొంతు కోసి హత్య చేశారు.

● **2026 ఏప్రిల్ 6న** కడప రిమ్స్ ఆవరణలో పెద్ద దస్తగిరిని ప్రత్యర్థులు గంజాయి మత్తులో విచక్షణారహితంగా పొడిచి హతమార్చారు. పలువురిపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు.

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజల ప్రాణాలను తోడేసే గంజాయి భూతానికి వైకాపా హయాంలో విపరీతమైన స్వేచ్ఛనిచ్చారు. అధికారం మారినా అదే మత్తు కడపను ఇంకా కొన్నిచోట్ల వదలట్లేదు. మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. కుటుంబాలకు ఆసరా కావాల్సిన వాళ్లు నేరగాళ్లై బంగారు భవిష్యత్తును కటకటాల పాల్జేసుకుంటున్నారు. అటు అయినవారికీ భారమవుతూ.. ఇటు తమంతట తామే జీవచ్ఛవాలుగా మారుతున్నారు. వీరి ఆగడాలతో ప్రజలు భయాందోళనల మధ్య జీవిస్తున్నారు. కట్టడికి పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన పోలీసులు సమీక్షలు.. డ్రోన్‌తో పర్యవేక్షణ అంటూ హడావుడి చేయడంతో సరి పెడుతున్నారు.

రోదిస్తున్న హత్యకు గురైన పెద్ద దస్తగిరి భార్య రమణమ్మ

నాలుగేళ్లలో జిల్లాలో చోటుచేసుకున్న హత్యలు...

సంవత్సరం	హత్యలు
2021	52
2022	51
2023	51
2024	53
2025	48
2026 (మార్చి వరకు)	08

● **ఆలంఖాన్‌పల్లెలో ఇలానేనా:** ఇటీవల కాలంలో ఆలంఖాన్‌పల్లెలో కొందరు మురాలుగా ఏర్పడ్డారు. వీరు గంజాయికి బానిసలయ్యారు. మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. కొందరు కత్తులు వెంటబెట్టుకుని వీధుల్లో యథేచ్ఛగా తిరుగుతున్నారు. ఇటువంటి వారిని గతంలో అధికారం వెలగబెట్టిన ఓ పార్టీ నేతలు ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా ఇటీవల నిర్వహించిన మారెమ్మ జాతర సందర్భంగా ఆలంఖాన్‌పల్లెలో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయలేదు. ఇదే ఆసరాగా పాత కక్షలతో పెద్ద దస్తగిరి అనే వ్యక్తిని కొందరు హతమార్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

● **ఇలానేనా పట్టేది జల్లెడ:** జిల్లాలో గంజాయి అమ్మకాలు గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతూనే ఉన్నాయి. డ్రోన్ కెమెరాలతో జల్లెడ పడుతున్నామని పోలీసులు చెబుతున్నా.. ఈ రాకాసికి ఇంకా అడ్డుకట్ట పడటం లేదు. ఒడిశా నుంచి అక్రమ మార్గంలో దిగుమతి చేసుకుంటూనే ఉన్నారు. ఇటీవల బద్వేలులో పోలీసులు స్వాధీనం చేసుకోవడం ఇందుకు బలం చేకూరుస్తోంది.

● **సమస్యాత్మక ప్రాంతాలపై ఏదీ నిఘా:** జిల్లాలోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల నిఘా కొరవడింది. ఇదే ఆసరాగా చేసుకుని మత్తులో దుండగులు నేరాలకు పాల్పడుతున్నారు. గంజాయి విక్రేతలు తమ ఆగడాలను సాగిస్తున్నారు. అభంశుభం తెలియని వారినీ మత్తులోకి దించుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక ప్రాంతాలపై మరింత నిఘా పెంచాలనే విషయాన్ని పోలీసులు విస్మరిస్తున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్.. చిత్రంలో జేసీ నిధి మీనా, డీఆర్వో మల్లికార్జునుడు తదితరులు

నీటి భద్రత మనందరి సమష్టి బాధ్యత

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో నీటి సంరక్షణకు గ్రామ స్థాయి నుంచి అవగాహన కార్యక్రమాల నిర్వహణ అందరి బాధ్యత అని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. జలధార కార్యక్రమంపై జేసీ నిధి మీనాతో కలిసి సంబంధిత అధికారులతో కడప కలెక్టరేట్‌లోని సభా భవనంలో సోమవారం సమీక్షించారు. సాగునీటి పారుదల, రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా చెరువుల ఆక్రమణలు గుర్తించి తొలగించాలన్నారు. పరిరక్షణకు హద్దులు నిర్ణయించి గోతులు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు తూముల లీకేజీ పనులను తొలి ప్రాధాన్య అంశంగా గుర్తించాలన్నారు. వాగులు, వంకలను పునరుద్ధరించాలని చెప్పారు. పొలాల్లో ప

మల్లెలు.. సస్యరక్షణతో రైతుకు సిరులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మల్లెలు సుమధుర సుమాలు. ఈ వేసవి కాలంలో పుష్పాలకు మంచి గిరాకీ ఉంటుంది. పూల నాణ్యత, పరిమాణం, అధిక దిగుబడి పొందాలంటే మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.మానస, కె.అంకయ్య కుమార్ సూచించారు.

పురుగులు: మొగ్గ తొలుచు పురుగు, ఎర్రనల్లి, ఆకు ముడత పురుగులు మల్లె తోటలను ఆశిస్తాయి. మొగ్గ తొలుచు పురుగు, వికసించే మొగ్గ మిడ్జ్ ప్రధాన ఆర్థిక ప్రాముఖ్యతను పొందుతాయి. ఎండు కంటే అవి మొక్కలకు అధిక నష్టాన్ని కలిగిస్తాయి.

మొగ్గ తొలుచు పురుగులు: మల్లె తోటల్లో ఇది ప్రధాన సమస్య. పురుగు లార్వా పువ్వు/మొగ్గలోకి చొచ్చుకొనిపోతాయి. పూల భాగాలను తినేస్తుంది. తీవ్ర దశలో మొగ్గలన్నింటినీ ఒక దగ్గరికి చేర్చి ముడుచుకుని పోయేలా చేస్తుంది. చిన్న గొంగళి పురుగులు పువ్వు మొగ్గపైన రంధ్రాలు చేస్తుంది. వీటి కోశస్థ నేలలో ఉంటుంది. నివారణకు వేపనూనె 5 మి.లీ లేదా బీటీ 2 మి.లీ లీటరు నీటికి కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. ఎకరాకు 5 చోట్ల హెలీ ల్యూర్ లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి.

మొగ్గ ఈగ: నీడ ఎక్కువగా ఉండే తేలికపాటి భూముల్లో ఈ సమస్య అధికంగా కన్పిస్తోంది. పిల్ల పురుగులు మొగ్గ అడుగు భాగంలో చేరి నష్టాన్ని కలిగిస్తాయి. పురుగు ఆశించిన మొగ్గలు ఎరుపు, నీలం రంగులోకి మారతాయి. ఆకృతి కోల్పోయి తర్వాత రాలిపోతాయి. ఎకరాకు 1 దీపపు ఎరను వాడుకోవాలి. నోవల్యురాన్ 1 మిలీ లేదా రైనక్సీపైర్ 0.3 లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఎర్రనల్లి: ఈ పురుగు ఉద్ధృతి పొడి వాతావరణంలో ఎక్కువగా ఉంటుంది. పురుగులు ఆకు, మొక్కల అడుగు భాగంలో చేరి రసాన్ని పీల్చేస్తాయి. ఆకులు, మొగ్గలు పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. నివారణకు స్పైరోమేసిఫెన్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వావిలాకు కసాయం లేదా గంధం పొడిని ఎకరాకు 8-10 కిలోలు చల్లుకోవాలి.

తామర పురుగు: ఆకు అడుగు భాగంలో గుంపులు గుంపులుగా చేరి ఆకులతోపాటు మొగ్గల నుంచి రసాన్ని పీలుస్తాయి. మొగ్గల రంగు మారిపోతుంది. జీవం కోల్పోయి ఎండిపోయి నేలరాలుతాయి. ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి ఆకు అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలి. నీలం జిగురు అట్టలను ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. నల్ల తామర పురుగులు కనిపిస్తే కొన్ని తెలుపు రంగు అట్టలను కూడా పెట్టుకుంటే పురుగులను అరికట్టవచ్చు.

ఆకుమచ్చ తెగులు: తెగులు ఆశించిన ఆకుల చివరి భాగం ముడుచుకుని పోతాయి. ఆకుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి 50 శాతం వరకు దిగుబడి తగ్గుతుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్/మాంకోజెబ్ 3 గ్రాములు లేదా కార్బండిజిమ్ 1 గ్రాము లీటరు నీటికి నెల రోజుల వ్యవధిలో మార్పు చేసి పిచికారీ చేయాలి.

ఎండు చీడ: తెగులు తొలి దశలో మొక్క కింద భాగం ఆకులు ఎండిపోతాయి. ఆ తర్వాత పై భాగంలో ఉన్న పత్రాలు కూడా ఎండి రాలిపోతాయి. తీవ్ర దశలో మొక్కంతా ఎండి చనిపోతుంది. నివారణకు మొక్కల చుట్టూ కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా బావిస్టన్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి భూమిని బాగా తడపాలి.

రైతేరాజు

టమాటలో తెగుళ్లు కట్టడి చేద్దామిలా!

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: వేసవిలో టమాట పంటను రైతులు సాగు చేశారు. వాతావరణంలో అనూహ్య మార్పులు రావడంతో పురుగులు, తెగుళ్లు ఆశించి పైరు ఎదుగుదల, దిగుబడిని దెబ్బతీస్తున్నాయి. సకాలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన ఉత్పత్తి పొందవచ్చునని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎస్.మానస తెలిపారు. ● కాయ తొలిచే పురుగు లేత ఆకులు, కొమ్మలను ఆశించి తినేస్తుంది. పిందె, కాయ తయారయ్యే దశలో ఈ పురుగు గుండ్రని రంధ్రాలు ఏర్పాటు చేసుకుని కాయ లోపలి భాగాన్ని పూర్తిగా తినేస్తుంది. నివారణకు ఎకరాకు నాలుగు చోట్ల లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. ట్రైకోగ్రామా బదనికలను ఎకరాకు 20 వేల చొప్పున విడుదల చేయాలి. ● ఆకుముడత సోకిన మొక్కల ఆకులు చిన్నగా మారి ముడుచుకునిపోతాయి. చీడ సోకిన మొక్కలు ప్రారంభ దశలోనే పొలం నుంచి తీసేయాలి. దోమ నివారణకు అంతర్వాహిక కీటకనాశనులు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా ప్రిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ● మొక్కల చిగురాకుల పైభాగంలో ఈనెలు గోధుమ వర్ణంలోకి మారి మాడిపోతాయి. తామర పురుగుల నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డేమటాన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

చిట్కా

ప్రశ్న: నిమ్మలో ఆకులు, కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలపగలరు? - నాగరాజు, మందరం

సమాధానం: నిమ్మలో ఆకు నల్లి, కాయ నల్లి నివారణకు ప్రాపర్‌గైట్ 1 మి.లీ, లేదా ఫెన్జాక్విన్ 1మి.లీ చొప్పున లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేయాలి. దీని ద్వారా సమస్యను నివారించవచ్చు.

- సునీల్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి రాజంపేట - న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

చీడపీడల నియంత్రణే.. మిర్చికి శ్రీరామరక్ష

పులివెందుల గ్రామీణ, న్యూస్‌టుడే: మిర్చి పంట సాగుకు ఉష్ణోగ్రత, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ ప్రాంతం అనుకూలమైనది. అయితే ఈ పంటకు సోకే తెగుళ్లు, వ్యాధులను యాజమాన్య పద్ధతుల్లో నివారించినప్పుడే అధిక దిగుబడులు పొందవచ్చునని అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శిరీష చెప్పారు.

● **సోకే తెగుళ్లు :** మిర్చి పంట ఆకులు పసుపు పచ్చగా మారి ముడత పడుతుంటే బొబ్బర తెగులు సోకిందని గుర్తించాలి. దీని నివారణకు వేగంగా నీటిని తుంపర్లలాగా పిచికారీ చేయాలి. ఈ విధంగా చేస్తే ఆకు వెనుకభాగంలో ఉండే పురుగులు బయటకు వస్తాయి. అలాగే ప్రాథమిక దశలోనే 5శాతం వేప కషాయం లేదా 3 వేల పీపీఎం వేప నూనెను పిచికారీ చేయడంతో పురుగులు పెట్టిన గుడ్లు నశిస్తాయి. ● నల్లతామర పురుగులు సోకి పువ్వులో ఉండే రసాన్ని పీల్చడంతో పూత రాలిపోతుంది. ఆకులు ముడుచుకుంటాయి. వీటి నివారణకు పొలం చుట్టూ జొన్న లేదా మొక్క జొన్న పంటను రక్షణగా వేయాలి. ● సాగు చేసిన మిర్చి పూత, కాయ దశలో ఎక్కువగా ఎండు తెగులు, కాయ కుళ్లు తెగులు వ్యాపిస్తుంది. కొలెట్రోట్రైకమ్ అనే శిలీంధ్రం వల్ల ఈ తెగుళ్లు సోకుతుంది. కొమ్మల చివర భాగం నుంచి ఎండిపోవడం మొదలై కింది వరకు వ్యాపిస్తుంది. ఈ రకమైన తెగుళ్లు నివారణకు ఎండిపోతున్న కొమ్మలను కత్తిరించి కాల్చివేయాలి. అలాగే మాంకోజెబ్ రసాయన మందు 2.5 గ్రాములకు లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి. ● తెల్ల దోమ, తామర పురుగుల ద్వారా వైరస్ తెగుళ్లు సోకుతాయి. ఈ వైరస్ సోకడంతో మిర్చి ఆకులు పసుపు రంగులోకి మారి చిన్నవిగా మారుతాయి. నివారణకు ఎసిటామిప్రిడ్ లేదా డైఫెంథియూరాన్ మందు పిచికారీ చేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు : ఎండ తీవ్రతతో నేల ఎండిపోకుండా తగినంతా నీటి తడులు అందిస్తూ ఉండాలి. అలాగే సూక్ష్మపోషకాలను మందులతో కలిపి పిచికారీ చేయాలి.

మహా నగరాలకు ఆగిన పరుగులు

అందుబాటులో దీర్ఘకాలిక వ్యాధులకు సేవలు ● నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కడప వైద్యం, న్యూస్‌టుడే: గతంలో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురైతే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహానగరాల్లోని కార్పొరేట్ వైద్యశాలలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ అవసరం లేదు. కడప నగరంలోనే అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలు అధునాతన వైద్య సేవలు అందిస్తున్నాయి. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లాలో అందుబాటులో ఉన్న వైద్యసేవలపై కథనం.

అందుతున్న సేవలివి..

● కడపలోనే హృద్రోగ సమస్యలకు సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో యాంజియోగ్రామ్, స్టంట్ వరకు వైద్యం అందిస్తున్నారు. కడపలోని కొన్ని ప్రైవేట్ వైద్యశాలల్లో ఓపెన్ హార్ట్ సర్జరీలు సైతం చేస్తున్నారు. రక్తాన్ని వడబోసి శుద్ధి చేసే మూత్రపిండాలు విఫలమైతే ఒకప్పుడు డయాలిసిస్ కోసం సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి వేచి చూసేవారు. ఇప్పుడు ద్వితీయ శ్రేణి నగరాల్లో సైతం ఎన్టీఆర్ ట్రస్ట్ కింద ఉచితంగా డయాలిసిస్ చేస్తున్నారు. నాడీ సంబంధిత విభాగంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో వైద్యం అందుబాటులో ఉంది. ప్రైవేట్ విభాగంలో అత్యంత క్లిష్టమైన సమస్యలకు కూడా చికిత్స అందిస్తున్నారు.

● పురిటిపిల్లలప్రాణాలను కాపాడడానికి ప్రభుత్వ ప్రైవేట్ విభాగాల్లో నియోనాటల్ వైద్యశాలలు సేవలు అందుబులో ఉన్నాయి. జీర్ణకోశ సంబంధిత సమస్యలు క్లిష్టంగా మారినప్పుడు గతంలో సుదూర ప్రాంతాలకు వెళ్లక తప్పనిసరి పరిస్థితులు ఉండేవి. నేడు నగరంలో ప్రైవేట్ విభాగంలో అత్యాధునిక గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యశాలలు అందుబాటులో ఉన్నాయి. మొండి వ్యాధుల చికిత్సకు, విషద్రావణాలు, పాముకాటు బాధితుల ప్రాణాలను కాపాడడానికి అత్యంత కచ్చితత్వంతో వైద్యం అందించడానికి జనరల్ మెడిసిన్ విభాగంలో నిపుణులు అందుబాటులో ఉన్నారు.

● నగరంలోని కొన్ని ప్రైవేటు వైద్యశాలల్లో అధునాతన ప్లాస్టిక్ సర్జరీలు కూడా చేస్తున్నారు. ఎముకలు కీళ్ల విభాగంలో మోకీళ్ల మార్పిడి మొదలుకుని అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలను జిల్లా కేంద్రంలోనే అవుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో మానసిక రుగ్మతల చికిత్సా కేంద్రం, డీ అడిక్షన్ సెంటర్, క్యాన్సర్ ఆసుపత్రుల్లో సేవలు అందిస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్టుతో పాటూ వివిధ ప్రైవేట్ సంస్థల ఆరోగ్య బీమా పథకాలు వర్తించడంతో జిల్లా వాసులు ఇక్కడే అధునిక వైద్య సేవలు పొందుతున్నారు.

రిమ్స్ ప్రాంగణంలో అర్ధరాత్రి కత్తుల కరాళ నృత్యం

● **జాతరలో మొదలైన గొడవ**

● **వెంటాడి స్థిరాస్తి వ్యాపారి హత్య**

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జాతర వద్ద మొదలైన గొడవ చినికిచినికి గాలివానలా మారి ఒకరి హత్యకు దారి తీసింది. పలువురు గాయపడ్డారు. దుండగులు కత్తులు, ఇనుప చువ్వలతో రెచ్చిపోయి విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ సంఘటన కడప రిమ్స్, తాలూకా రాణాల పరిధిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది.

● కడప శివారులోని ఆలంఖాన్‌పల్లెకు చెందిన వైకాపా నాయకుడు పెద్దదస్తగిరి (53) స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 4వ తేదీ మారెమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే వద్ద ఆయన కుమారుడు వెంకట దస్తగిరికి అదే ప్రాంతానికి చెందిన వెంకటేష్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొద్దిసేపటికి వెంకటదస్తగిరి ఇంటికి వెళ్లి తన తండ్రికి జరిగిన విషయం చెప్పడంతో ఆయన డీజే వద్దకు వెళ్లి గొడవలు పడొద్దని సర్దిచెప్పి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో మరుసటి రోజు 5వ తేదీ ఆదివారం రాత్రి వెంకటదస్తగిరి మారెమ్మ ఆలయం వద్ద నుంచి వెళ్తుండగా.. వెంకటేష్ కొంత మంది యువకులతో కలిసి వెంటాడి అతనితో పాటు బంధువులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో సిద్దయ్య, మౌలాలమ్మ, కె. దస్తగిరిలు తీవ్రంగా గాయపడగా పెద్ద దస్తగిరి, అతని సోదరుడు చిన్న దస్తగిరిలకు స్వల్పగాయాలయ్యాయి.

పెద్ద దస్తగిరి (పాత చిత్రం)

కాపు కాచి అంతమొందించి..

క్షతగాత్రులకు వైద్యం చేయించేందుకు పెద్ద దస్తగిరి, అతని సోదరుడు చిన్న దస్తగిరిలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వెళ్లారు. అప్పటికే కాపు కాచి ఉన్న పది మంది యువకులు వారిద్దరిని చుట్టుముట్టారు. కత్తులతో విరుచుకుపడి విచక్షణారహితంగా పొడిచారు. పెద్ద దస్తగిరి శరీరంపై పదికి పైగా కత్తిపోట్లు పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. అతని సోదరుడు చిన్నదస్తగిరికి ఛాతీ పక్కన పొడవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. మృతుడి కుమారుడు వెంకటదస్తగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు వెంకటేష్, మనోహర్, సురేంద్ర అలియాస్ జాకీ, ఉపేంద్రలతో పాటు చెన్నూరుకు చెందిన రాజా, రవిలపై హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో రాజా, రవిలపై గతంలోనూ రౌడీషీట్ ఉన్నట్లు వారు చెప్పారు. హత్య జరిగిన ప్రాంతాన్ని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సోమవారం పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారించి దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆయన ఆదేశించారు.

దుండగుల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నదస్తగిరి

యాదృచ్ఛికమా.. పన్నాగమా..!

పెద్దదస్తగిరి హత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కడప పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని నియోజకవర్గ స్థాయి మాజీ ప్రజాప్రతినిధితో ఆయనకు భూ సంబంధిత వ్యవహారాల్లో సత్సంబంధాలు ఉన్నాయి. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు తలెత్తడం.. ఇంతలోనే పెద్దదస్తగిరి హత్యకు గురి కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మారెమ్మ జాతర నేపథ్యంలో ఇంటి వద్ద జరిగిన ఘర్షణ తరువాత దుండగులు అదే పనిగా రిమ్స్ వద్దకు వచ్చి కాపుగాచి మరీ హత్య చేయడం వాటికి బలం చేకూరుస్తోంది. రిమ్స్ ఇన్‌ఛార్జి సీఎ ఓబులేసు మాట్లాడుతూ.. ఈ హత్య పథకం ప్రకారం చేశారా? లేదా యాదృచ్ఛికంగా జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాధిత ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రాణాలకు వచ్చే బాధిత ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. ప్రతి ఒక్క బాధితుడికి న్యాయం చేకూరేలా చూడాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 114 మంది బాధితులు వచ్చి వారి సమస్యలను ఎస్పీకి వినతుల రూపంలో తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. చట్టానికి అతీతమించే పనులు చేయవద్దని సూచించారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో చోరీలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలను కట్టడి చేయాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రకాష్‌బాబు, మహిళా రాణా డీఎస్పీ బాలస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు వింటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

'వైకాపా నాపై మోపని కేసుల్లేవ్'

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు తనపై ఒక్క రేప్ కేసు తప్ప అన్ని కేసులు పెట్టారని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మండిపడ్డారు. భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక రిపబ్లిక్ క్లబ్‌లో జరిగిన 'మన ఊరు - మన జెండా' కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. 2019 మార్చి 15వ తేదీ ఉదయం వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని మాజీ సీఎం జగన్ సొంత ఛానల్‌లో వచ్చిందన్నారు. మధ్యాహ్నం నాటికి ఆదినారాయణరెడ్డి, చంద్రబాబు, బీటెక్ రవి నరికి నరికి చంపారని జగన్ బ్యాచ్ నిందలు మోపిందని విమర్శించారు. వివేకా హత్యపై విచారణ సీబీఐ చేపట్టాలని అడిగిన వారే తరువాత వద్దన్నారన్నారు. వివేకా కుమార్తె సునీత పదే పదే కోర్టుకు వెళ్తుంటే హత్య చేసింది ఆదినారాయణరెడ్డి బ్యాచ్ కాదని.. సునీత హస్తముందని మాట మార్చారన్నారు. జగన్ కంటి రెప్పకు దెబ్బ తగిలితే అది హత్యాయత్నమని, నరికి నరికి చంపితే అది గుండెపోటా..? అని సొంత చెల్లెలు షర్మిలానే చెబుతుండటం విశేషమన్నారు. జగన్ వద్దకు ఎవరు వెళ్లినా చేతులు కట్టుకోవాలని, సార్ అనే పిలవాలని అన్నారు. తాను కష్టపడి వైకాపా బలోపేతానికి కృషి చేస్తుంటే తనకే దెబ్బకొట్టాడని విమర్శించారు.

నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న జగన్

రాష్ట్ర రాజధాని గురించి జగన్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దుయ్యబట్టారు. మావిగన్ అనేది ఒక పేరేనా..? అని విమర్శించారు. ప్రజలను అమాయకులను చేసి ఓట్లు దండుకునేందుకు చూస్తున్నారని హెచ్చరికలు చేశారు. ప్రజలను ఆయన కన్వీజ్ చేస్తే మనం కన్వీనెన్స్ చేసి అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేశ్‌రెడ్డి, బీరం సంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, మునిసుబ్బారెడ్డి, శివరామలింగారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కోర్టు ఉద్యోగాల నోటిఫికేషన్ రద్దు

డాక్టర్ యామిని

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కోర్టులోని ప్రంట్ ఆఫీస్ కోఆర్డినేటర్ పోస్ట్ భర్తీకి సంబంధించి గత జనవరి నెల 12వ తేదీ జారీ అయిన నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాలతో ఈ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. సదరు నోటిఫికేషన్ ఆధారంగా జరిగిన ఎంపిక ప్రక్రియను రద్దు చేశామన్నారు. త్వరలో కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ పరీక్ష ఫీజు చెల్చించాల్సిన అవసరం లేదని ఆమె చెప్పారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

కడప విద్య, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ అబ్దుల్లా అన్నారు. స్థానిక నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాలలోని పదోతరగతి మూల్యాంకన కేంద్రంలో సోమవారం ఫ్యాప్టో జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాయకులు, ఉపాధ్యాయులు నల్ల పట్టీలతో నిరసన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా 12వ పీఆర్సీపై ఎటువంటి స్పందన లేదన్నారు. మధ్యంతర భృతి ప్రకటించలేదన్నారు. ఇప్పటికే రూ.30 వేల కోట్ల బకాయిలు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కంభం బాలగంగిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, ఇలియాస్‌బాషా పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

యూఈసీడబ్ల్యూయూ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విద్యుత్తు సంస్థలో 20 ఏళ్లుగా పని చేస్తున్న ఒప్పంద కార్మికులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (యూఈసీడబ్ల్యూయూ) రాష్ట్ర కార్యదర్శి బాలకాశి డిమాండ్ చేశారు. యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం విజయవాడ దాసరి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎల్. రామలింగారెడ్డి, అధ్యక్షుడిగా పెరుమాళ్ల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా మిరియాల బాలకాశి, కోశాధికారిగా రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి. చంద్రశేఖర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కామన సంజయ్, ఉపాధ్యక్షులుగా డి.మణిపాల్(కృష్ణా జిల్లా), రాము (కడప), సహాయ కార్యదర్శులుగా పి.కృష్ణా (నెల్లూరు), సురేష్ (కడప), నాగిరెడ్డి (కడప), సాంబశివారెడ్డి (కడప), సి.శివన్న(కడప)లతో పాటు పలువురిని సభ్యులుగా ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న బాలకాశి వేదికపై సంఘ నాయకులు

నాలుగు కొండ చిలువల పట్టివేత

వీరబల్లి, న్యూస్‌టుడే : మండలంలోని మాదిరెడ్డిగారిపల్లి సమీపాన పొలాల వద్ద సోమవారం రాత్రి పలువురికి కొండ చిలువలు కనిపించాయి. అటు వైపు వెళుతున్న రైతులు గమనించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖా అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని నాలుగు పొడవాటి కొండచిలువలను పట్టుకున్నారు. అనంతరం వాటిని సానిపాయి రేంజ అధికారుల సూచన మేరకు అడవిలోకి తీసుకెళ్లి వదిలేశారు. కొండచిలువలను పట్టుకుని తరలించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

నందలూరు, న్యూస్‌టుడే : చెక్ బౌన్స్ కేసులో మంటపం పల్లె గ్రామానికి చెందిన బత్తల రాజశేఖర్‌రెడ్డికి నందలూరు జూనియర్ సివిల్ జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాశ్ ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. దీంతో అతన్ని కడప సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించామన్నారు. 2019లో ఎర్రిపాపయ్యగారి పల్లెకు చెందిన బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి రూ.7 లక్షలు, నాగిరెడ్డిపల్లెకు చెందిన పోతురాజు మస్తానయ్యకు రూ.6 లక్షలు విలువైన చెక్కులను బత్తల రాజశేఖర్‌రెడ్డి ఇచ్చారు. ఆ చెక్కులు బౌన్స్ కావడంతో వారు కోర్టును ఆశ్రయించారు. వాదోపవాదాలు అనంతరం జడ్జి తీర్పు వెలువరించారన్నారు. కార్యక్రమంలో కోర్టు కానిస్టేబుల్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

వల్లూరు, న్యూస్‌టుడే: పుష్పగిరి వద్ద పెన్నానదిలో ఆదివారం సాయంత్రం గల్లంతైన కృష్ణచైతన్య (20) మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైందని ఎస్ఐ శివరామిరెడ్డి తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లా మదనపల్లె, చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతాలకు చెందిన ఎనిమిది మంది లఘుచిత్రం తీయడానికి రావడం, సరదాగా నదిలోకి దిగిన వారిలో ముగ్గురు సుడిగుండంలో చిక్కుకోవడం, ఇద్దరి మృతదేహాలు ఆదివారం లభ్యం కావడం తెలిసిందే. లభ్యమైన కృష్ణచైతన్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు. ఆదినిమ్మాయపల్లెలోని పుష్పగిరి పర్యాటక కేంద్రం కాదని ప్రమాదకర ప్రాంతాలున్నాయని.. సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప రైల్వేస్టేషన్ ఆవరణలోని గూడ్స్ రైలు కింద పడి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కడప చెమ్మూమియాపేటకు చెందిన జయమ్మ (40) సోమవారం కడప రైల్వేస్టేషన్‌కు వెళ్లి గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

రాజంపాళెం, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు రాజంప